# డిప్రెషన్

> ఎంత డబ్బైనా పెట్టి మనం కొనుక్కోలేనిది... సంతోషం ! అది మనస్సులో నుండే జన్మించాలి.
>
> \- జయప్రద

"జయా!

సారీ... నీ ఉత్తరాలకు ఈమధ్య ప్రామ్ప్ట్‌గా జవాబివ్వలేకపోతున్నాను. వయస్సు నలభై దాటింది కదా... ఏదో నిస్తేజం, నిరాసక్తత, అసంతృప్తి! అన్నీ వుండి, సంతోషంగా లేననే ఫీలింగ్!

మనం చదువుకునే రోజుల్లో ఎంత ఆనందంగా వుండేవాళ్ళం!

మన పేరెంట్స్ పంపించే చిన్న అమౌంట్‌తోనే ఎంత ఎంజాయ్ చేసేవాళ్ళం!!

ఫ్యూచర్ ఏమిటో తెలీని మనలో ఎన్ని ఆశలు! ఎన్ని కలలు!! వాటి తాలూకు ఎన్ని ఆనందపు విరిజల్లులు!

అవన్నీ ఏవీ..?

ఆ కొండలు, ఆ సముద్రం- ఆ విశాఖ గాలులు... ఎంత పరవశించిపోయేవాళ్ళం మనం! ఇప్పుడు చెట్లు ఊగుతున్నట్లున్న చిత్రం కళ్ళముందు కనిపిస్తుందేగానీ, ఆ అందాలు మనసును తాకడం లేదు. 'ఉక్కగా లేదు' అని అనుకుంటానేగాని, ఆ చల్లటి అల్లరిగాలి నా శరీరాన్ని పరవశింపజేయదేం?!

నీకు గుర్తుందా..?

మనం టెర్రస్ మీద కూర్చుని- ఎన్ని కబుర్లు చెప్పుకునేవాళ్ళం! డిగ్రీ చేతిలో పడగానే ఉద్యోగం చేయాలనీ... ఆ వచ్చే డబ్బుతో అవి కొనాలనీ, ఇవి కొనాలనీ!

కానీ, జయా! ఇప్పుడు నేను- మనం ఊహించుకున్నదానికంటే ఆర్థికంగా చాలా ఎత్తులో వున్నాను. కోరుకున్న దానికంటే మంచి భర్త, అందమైన మాతృత్వ వరం, అన్నీ

లభించాయి. అయినా ఊహలలో మనం ఆస్వాదించిన ఆనందం- ఇప్పుడు నాలో ఎందుకు లేదు? చెప్పు జయా! ఎందుకు లేదంటావ్?

తీరిగ్గా నా జీవితపు లోతుల్లోకి తొంగిచూసుకుని అప్పుడప్పుడూ ఆలోచించు కుంటాను. నా పెళ్ళయిన కొత్తలో ఓ చిన్నకుటీరం, అందులో నేను, నా వారు, నెలకు సరిగ్గా సరిపోయే సంపాదన! ఇప్పుడు నెలసరి అవసరాలు తీరిపోయాక ఇంకా మిగిలే డబ్బు, దాంతో నగలు, చీరలు, పిల్లలకు డొనేషన్స్- ఒక్కమాటలో చెప్పాలంటే... ఈ దేశంలో చాలామందికి వుండే సమస్యలు మాకు లేవు. నాలుగు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తులు చేసిపెట్టారు మావారు.

జయా! నేను సంతోషంగా వుండడానికి చాలా ప్రయత్నాలు చేశాను. ఆఖరికి- మా పక్కింటివారి సలహా మీద క్లబ్‌లకు కూడా వెళ్లాను... కానీ, నాలో ఆనందం ఒక్క సి.సి. కూడా పెరగలేదు.

జయా..!

నీతో ఆ అనుభూతుల్ని మరోసారి నెమరువేసుకోవాలని వుంది...

నాలో కలుగుతున్న ఈ అలజడిని నీతో పంచుకోవాలని వుంది.

ఇద్దరం కలిసి విశాఖపట్నం వెళ్లి ఆ సముద్రాన్నీ, ఆ కొండలనీ చూసి పరవశించాలని వుంది. కానీ, రాలేను. నా మనసుకు మాత్రం రెక్కలు కట్టుకుని నీ దగ్గరికి రావాలని వుంది. ఎప్పుడో వస్తాను. నీ స్నేహం తాలూకు మాధుర్యంలో కొన్నిరోజులైనా సేదతీరాలని వుంది. కానీ, ఈ బంధాలు, బాధ్యతలు... ఇవన్నీ నన్ను కట్టేస్తున్నాయి.

నువ్వు నాకంటే తెలివిగలదానివి. నాకు సలహా చెప్పవా? ఈ ఉత్తరం రాస్తుంటే.. మా చిన్నబాబు అంటున్నాడు- 'ఇంత కష్టపడి ఉత్తరం రాయకపోతే ఫోన్‌లో మాట్లాడకూడదా?' అని.

కానీ, జయా! ఫోన్‌లో ఇంత స్పష్టంగా చెప్పలేను. గొంతులో ఏదో అడ్డుకున్న భావం.

వుంటాను...

నీ ఉత్తరం కొరకు ఎదురుచూస్తూ -

నీ

- సింధు"

- ఉత్తరం చదవటం పూర్తిచేసిన జయలక్ష్మి నిట్టూర్చింది.

ఐదు నిముషాల తర్వాత లేచి కూర్చుని లెటర్ పేడ్ అందుకుంది.

●

స్నేహితురాలి ఉత్తరాన్ని చదివిన సింధూరలో విలక్షణమైన భావాల సముదాయం తాలూకు కన్‌ఫ్యూజన్.

మరలా ఉత్తరంలోకి తొంగిచూసింది సింధు.

"సింధూ..!

నీ సంతోషం కొరకు నువ్వు ప్రయత్నించిన విధానం బాగా లేదు.

'షాపింగ్‌కి వెళ్లడం' అనేది తాత్కాలిక ఆనందాన్ని పొందడానికి ఆడవాళ్ళు- నాతో సహా... చేసే ప్రయత్నమే అది ! కానీ, అది శాశ్వతం కాదు. ఎందుకంటే... అది మెటీరియలిస్టిక్ విధానం ! కొద్దిరోజులకు వెగటు కలిగే పద్ధతి అది !

మన పరిధిలోనే, మన ఇంట్లోనే, మనవాళ్ళతోనే మనం ఆనందాన్ని వెతుక్కో లేనప్పుడు- క్లబ్‌లో ఎన్నో మనస్తత్వాల మధ్య అది దొరుకుతుందా? చెప్పు ! ఆమధ్య నువ్వు రాసిన ఉత్తరంలో నీ మనసు బాధపడిన ఓ సంఘటనను ఇప్పుడు గుర్తుకుతెచ్చుకుని ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే... అప్పుడు దానికి నేను జవాబిస్తే- నిన్ను సమర్థించి, నీకు మనశ్శాంతి నివ్వాల్సి వచ్చేది. అది తప్పు ! అందుకే నిశ్శబ్దంగా ఉండిపోయాను. ఇప్పుడు దాని అవసరం చాలా ఉందనిపిస్తోంది.

ఆరోజు నువ్వు ఇలా రాశావు...

'జయా! నా కోడలిని నేను చాలా బాగా చూసుకుంటున్నాను. కూతుళ్ళు లేని నాకు- కీర్తనే కూతురు అనుకున్నాను. కానీ జయా! ఆ అమ్మాయి ప్రతిదానికీ అభ్యంతరం తెలుపుతుంది. నేను చెప్పే దేనినీ అనుసరించదు, నా కోరిక తీర్చదు. తన ఏ చిన్నకోరికనూ చంపుకోదు. నేను నా కోరికలు చంపుకుని ఆ అమ్మాయి కోర్కెలను తీర్చిన సందర్భాలెన్నో వున్నాయి. కీర్తన అలా ఎందుకు ప్రవర్తిస్తుందంటావు?' అని వాపోయావు ఆ లెటర్‌లో నువ్వు.

అందుకే నేను- 'ఏదో తెలియని వయస్సులే... రోజులు గడిస్తే ఆ అమ్మాయే నిన్ను అర్థం చేసుకుంటుందిలే!" అని గోడమీద పిల్లిలా జవాబిచ్చాను. అలా అని నీ మనసును జోలపాడి పొరపాటు చేశాను. సత్యం చెప్పి ఎదుటివ్యక్తి మనసును ప్రభావితం చేయాలి. కానీ, అన్నివేళల్లో సర్దిచెప్పకూడదు. ఎందుకంటే అవతలి వ్యక్తి మారుతారని ఆశిస్తూ... మారరని తెలుసుకుంటూ.... బాధపడ్తూ, దిగులుపడ్తూ మన మనసుకు మనం ఎంతకాలమని నచ్చచెప్పగలం? ఎప్పుడో ఒకప్పుడు అది బరస్ట్ అవుతుంది. ఆ భాగ్యానికి... ఎదురుతిరిగే మనసును కొన్నాళ్లో... కొన్నేళ్లో కష్టపెట్టడం సమంజస మంటావా?

ఇలా అడుగడుగునా నీ జీవితంలో, నా జీవితంలో- పక్కవాళ్ళ జీవితాల్లో ఇలాటి సాంసారిక సంఘటనలు కోకొల్లలు! దాని తాలూకు సంక్షోభాలు అవిరామంగా సాగుతూనే ఉంటాయి.

"మీ ఇంట్లో మీకే బాధలు లేవా?" అని ఎవరినైనా అడిగి చూడు-

ఎవరైనా ' లేవు ' అని చెప్తే- అది ఆత్మవంచన, సంస్కారపు ముసుగు... అంతే !

అందుకే చెప్తున్నాను... ఇలాటి వెన్నో సంఘటనలు ! వాటన్నిటికీ నిరాశపడడం మానేయి. దిగులుపడకు, విరక్తి చెందకు. ఎందుకంటే... నీకు నువ్వే కొనుక్కున్న దీర్ఘకాలపు ఆ భావ సంఘర్షణలు నిన్ను ఇప్పుడు డిప్రెషన్‌లోకి నెట్టాయి.

జయ దగ్గర నుండి వచ్చిన ఉత్తరాన్ని మరోసారి చదవాలని ప్రారంభించింది సింధూర.

కళ్ళల్లో నిలిచిన నీటితెర ఉత్తరంలోని అక్షరాల్ని మసకబార్చింది. కళ్ళు తుడుచుకుని, మనసును విదిలించుకుని, తనకు ప్రియమైన ఆ లేఖలోకి తొంగిచూసింది.

"సింధూ..!

నువ్వు మంచి పనిచేశావు... ఉత్తరం రాసి!

అక్షరాలతో మన మనస్సును పేర్చుకుని ఒకరి ముందు పరచుకోగలిగినట్టు- ఫోన్‌లో చేయలేం. పైగా- ఉత్తరం రాయడం, అందుకోవటం కూడా ఓ మంచి అనుభూతి! ఆ అనుభూతి తాలూకు ఆనందం అనిర్వచనీయం !!

ఆ ఉత్తరం చూసిన క్షణంలో నా మనసులో మెదిలిన భావం ఏవిటో చెప్పనా సింధూ! నీ సమస్యలకు, నీ నిరాసక్తతకు కారణం... కారణం నువ్వే!

కోపం వచ్చిందా..? వచ్చినా ఫర్వాలేదు. ఎందుకంటే... నాకు కావాల్సింది- నిన్ను నువ్వు తెలుసుకోవటం, తద్వారా నీకై నువ్వే నీ సంతోషాన్ని సృష్టించుకోవడం, నీ ఆత్మపరిశీలనలో నువ్వు నీ సంతోషాన్ని దినదినం వృద్ధి చేసుకోవడం !

ఓ కవి ఇలా అంటాడు... "నాలో వున్న కుళ్ళు, కోపం, కక్ష, ప్రిస్టేజ్, పొగరు, ఇగో- అనే ఆరు రాక్షసుల్ని జయించాను. అందుకే నేనిప్పుడు సంతోషంగా వున్నాను" అని! నువ్వు వాటినింకా అధిగమించలేదు. నీకు 'సంతోషం కావాలి...' అనుకుంటే వాటిని జయించడానికి ప్రయత్నించు.

ఇంకొకటి సింధూ...

నువ్వు ఎవరికైనా సహాయం చేసేప్పుడు వాళ్ళ నుండి తిరిగి సహాయం ఆశించి చేయకు. అదే మన మనసు మీద ఎదురుదెబ్బ కొట్టేది. అంతటి గొప్ప ఎత్తుకి నువ్వు ఎదగలేకపోతే అసలు సహాయమే చేయకు.

విధి అందించే విషాదాల నుండి ఎలానూ తప్పించుకోలేం. మన చేతిలోనే మన సంతోషాన్ని సృష్టించే సహనం, సర్దుబాటు మనస్తత్వం అనే ఆయుధాలు వున్నప్పుడు- వాటిని మనం వాడుకుని ఎందుకు సుఖపడకూడదు? దాన్ని 'బానిస బతుకు' అని ఎవరైనా అంటే... అది వాళ్ళను వాళ్ళు సమర్థించుకోవడానికి చేసే ప్రయత్నం... అంతే !

డామినేషన్ వల్ల పనులు జరగొచ్చు. నలుగురి మధ్య మన పేరు మోగొచ్చుగానీ- మన మనస్సాక్షికి జవాబు మాత్రం చెప్పుకోలేం. మంచి స్నేహితుల్నీ సంపాదించలేం.

సింధూ..! ఒకరికి అన్యాయం చేయకుండా మనం మన సంతోషాన్ని ఎన్నో విధాల కొనుక్కోవచ్చు. ఆలోచించు... ఇవన్నీ నేను రచయిత్రిగా చెప్పక్కర్లేదు. మనల్ని మనం శోధించుకుంటే మన మనసుకు అందే విషయాలే ఇవి !"

- చదవటం క్షణం ఆపింది సింధూర. 'ఇదెలా సంభవం? తన సంతోషాన్ని తానెలా సృష్టించుకోగలదు? తను ప్రయత్నించి ఓడిపోయింది కదా !'

దబ్బుతో సంతోషం వస్తుందనేది కల్ల !

దబ్బు ఒక నిషా...

దాంతో సుఖపడమని తెలిసీ దానిచేత విపరీతంగా ఆకర్షింపబడే ఒక తాగుబోతు నిషా అది! పైగా, మీవారు నాలుగు తరాలకు సరిపడా సంపాయించి పెట్టారన్నావు. నీకు అర్థంకావడం లేదా ? ఆ సంపాదనలో పడి నీతో ఆయన ఎక్కువకాలం గడపలేకపోతున్నాడని! ఆయన ఈ 'దూరం' నిన్ను బాధిస్తోందేమో ఆలోచించు.

ఇంకా ఎదగాలనే ప్రలోభాన్ని వదిలేసి ఇద్దరూ సంతోషంగా వుండండి.

పోతే, సింధూ !

పెళ్ళయిన కొత్తలో వున్న సంసార సంగీతపు సంతోషాల సందడి ఇంకా ఇప్పుడు ఉండాలంటే... ఎలా వీలవుతుంది ? కాలంతో వచ్చే మార్పుల్ని మనం అంచనా వేయాలి. కొత్తదనం- పాతపడడమనే 'సహజత్వాన్ని' నువ్వు తెలుసుకోలేదు. అందుకే ఈరోజు నీలో లోపాల్ని నీ ముందు పరుస్తున్నాను.

ఇలా రాస్తున్న నన్ను అర్థంచేసుకో, తర్వాత నిన్ను నువ్వు అర్థంచేసుకో... అప్పుడు నీకు అందరూ అర్థమవుతారు. వృద్ధాప్యం మన శరీరాలకే... మనసుకు రాకూడదు... రానీకు ప్లీజ్ !

ఇంకో తమాషా ఏమిటంటే... సింధూ !

ఒక్క క్షణం మనం తెలివిగా ఆలోచిస్తే... ఆ క్షణాన్ని జారనీకపోతే- అందరం ఆనందంగా వుండొచ్చు. ఆ నగ్నసత్యాన్ని మనం గ్రహించడానికి ఇష్టపడడం లేదు.

చావుకీ, బతుక్కీ మధ్య గీత చాలా పెళుసైంది. ఎప్పుడు పోతామో తెలీని ఈ కాసింత జీవితంలో... ఎందుకీ కక్షలు? ఎందుకీ మారణ యజ్ఞాలు?

'ఇప్పుడో, మరుక్షణమో అందరం పోవలసిన వాళ్ళమే!' అని మనకు తెలుసు. మనకు తెలిసిన ఆ సత్యాన్ని మన మనసుకు పట్టించుకుంటే ఎవరివల్ల ఎవరికీ అశాంతి వుండదు. అంతా ఆనందమే! కానీ, ఆ రోజెప్పుడో!?

ఆఖరుగా... ఒక మాట చెప్పాలి -

ఎవరూ మారరు...

ఎవరి మనస్తత్వాలూ మారవు... మారని వాళ్ళని మార్చలేం కనుక నువ్వే మారు ! అదొక్కటే నీ చేతిలో వుండేది. ఎవరి ప్రభావాల ప్రమేయం లేని స్వీయ సంతోషాన్ని నువ్వే సృష్టించుకో! అప్పుడు నీ ఆనందాన్ని ఎవ్వరూ, ఎప్పుడూ కొల్లగొట్టలేరు.

మరలా చెప్తున్నాను సింధూ...

ఎవర్నీ మార్చలేనప్పుడు- మనం మారడమే మన సంతోషానికి మనం ఇచ్చుకోగల పరిష్కారం.

ఏ సాల్వేషన్ ఇవ్వకుండా ఈ ఉత్తరాన్ని పూర్తిచేయడం అన్యాయం కాబట్టి నాకు తోచింది నేను చెప్తున్నాను. నీ ద్వారా గానీ, దబ్బు ద్వారా గానీ అవతలి వ్యక్తిలో నువ్వు

సంతోషాన్నీ, సంతృప్తినీ, కృతజ్ఞతనూ చూడగలిగినప్పుడు- మనలో కలిగే ఆనందమే నిజమైన ఆనందం !

అందుకే చెప్తున్నాను...

నీ దగ్గర దబ్బుంటే... దాంతో కష్టాల్లో ఉన్నవాళ్ళ కన్నీళ్లను తుడిచి, నీ ఆనంద భాష్పాల్నీ తుడుచుకో !

ఉంటాను...

ప్రేమతో
నీ
జయ"

●

స్నేహితురాలి ఉత్తరం చదవటం మూడవసారి పూర్తిచేసిన సింధూరలో ఓ మెరుపు- ఆమె కళ్ళల్లో ఆ మెరుపు తాలూకు ప్రభలు!

'నిజమే! తమకు టీ.వీ. లేని రోజుల్లో టీ.వీ. కొనుక్కోవాలనే ఆశ తనకి సంతోషాన్నిచ్చింది. టీ.వీ. కొన్నాక ఏ ఛానల్ ఎవరు చూడాలో అర్థంకాక మనస్పర్థలు, కోపాలు ! దానిని సాల్వ్ చేసుకోవడానికి రూముకొక టీ.వీ. దాంతో మనుషులే దూరమైపోయారు. ఆ వెలితి తనలో వుంది.

జయ చెప్పింది అక్షర సత్యం. కీర్తన నుంచి ఏవీ ఆశించడం మానేసాక తన మనసు కొంత కుదుట పడింది. తను నా మనిషి అనే హక్కుని వదిలి పెట్టేశాక తగవులూ తగ్గిపోయాయి.

సంతోషాన్ని కొనుక్కోవటం ఇంత తేలికా?' ...అలా అనుకున్న మరుక్షణం ఆమె మనసు తేలిక పడింది.

●

'వార్త' దినపత్రిక 'ఆదివారం 'వార్త' ... 18 మే' 2003 సంచికలో ప్రచురితమైన కథ